www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 24 ఫిబ్రవరి 2023



నేడు ఏలూరు రానున్న చంద్రబాబు

ఉభయగోదావరి జిల్లాల నేతలతో విస్తృత సమావేశం

ఏలూరు ప్రతినిధి: టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు శుక్రవారం ఏలూరు విచ్చేయనున్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించి క్షేత్రస్థాయిలోని క్లస్టర్, యూనిట్, మండల, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలతో సమావేశం కానున్నారు. దాదాపు మూడు వేల మంది ఈ సమావేశానికి హాజరు కానున్నట్లు టిడిపి నాయకులు గురువారం తెలిపారు. ఏలూరు బైపాస్ రోడ్డులోని స్వరాజ్ ట్రాక్టర్ షోరూమ్ దగ్గర్లో ఈ సమావేశం జరగనుంది. సమావేశ ఏర్పాట్లను గురువారం టిడిపి నాయకులు పితాని సత్యనారాయణ, మాగంటి బాబు, గన్ని వీరాంజనేయులు, చింతమనేని ప్రభాకర్‌తోపాటు పలువురు నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సమావేశ వివరాలను వెల్లడించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ క్షేత్రస్థాయి ఇన్‌ఛార్జులకు రాబోయే ఎన్నికలకు సంబంధించి పార్టీ నాయకత్వం దిశానిర్దేశం చేయనుంది. మధ్యాహ్నంచంద్రబాబు ఈ సమావేశానికి హాజరై మాట్లాడనున్నారు.

పొలం బీటలు..!

సాగు నీరందక వరి రైతుల పాట్లు వర్ణనాతీతం

రెండు జిల్లాల్లోనూ సక్రమంగా అమలుకాని వంతుల విధానం


ఇంజన్లతో నీటి తోడకానికి ఖర్చు తడిసి మోపెడు

ఆక్వా చెరువులకు సాగునీరు మళ్లింపు

నీరందక దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీలో వరి రైతులు సాగునీటి కోసం పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. రెండు జిల్లాల్లోనూ పరిస్థితి రోజురోజుకీ ఆందోళనకరంగా మారుతోంది. వంతులవారీ విధానం సక్రమంగా అమలు కాకపోవడం, గోదావరి నుంచి సరిపడా నీరు రాకపోవడంతో రైతులు నానావస్థలు పడుతున్నారు. పెద్దఎత్తున సొమ్ము ఖర్చు చేసి ఇంజిన్లతో నీటిని తోడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. రెండు జిల్లాలవ్యాప్తంగా దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఏలూరు జిల్లాలో లక్షా పది వేల ఎకరాలుండగా, పశ్చిమగోదావరి జిల్లాలో రెండున్నర లక్షలకు పైగా ఎకరాల్లో వరిసాగు సాగుతోంది. పొలాలన్నీ పొట్ట, ఈనిక దశకు చేరుకున్నాయి. ఈ సమయంలో సాగునీరు అందకపోవడంతో రైతులు నానాఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం గోదావరి నుంచి 3,900 క్యూసెక్కుల నీరు రెండు జిల్లాల్లో ఆయకట్టుకు విడుదలవుతోంది. పొలాలకు సరిపడా సాగునీరు అందాలంటే కనీసంగా ఐదు వేల క్యూసెక్కుల వరకూ రావాల్సి ఉంది. గోదావరి జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో సీలేరు జలాలపైనే ఆధారపడి ముందుకు సాగాల్సి వస్తోంది. ప్రస్తుతం సీలేరు నుంచి ఏడు వేల క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే వంతుల వారీ విధానం అమలవుతోంది. అయినప్పటికీ సాగునీరు సక్రమంగా అందడం లేదు.



నిడమర్రు మండలం బువ్వనపల్లిలో సాగునీరందక బీటలు వారిన పొలం

సక్రమంగా అమలుకాని వంతుల విధానం

ప్రతి కాలువకూ ఐదు రోజులు చొప్పున వంతుల వారీ విధానం అమలు చేసేలా ప్రణాళికలు రచించారు. అయితే అది సక్రమంగా అమలు కావడం లేదు. దీంతో రైతులు నానావస్థలు పడుతున్నారు. నిడమర్రు మండలం బువ్వనపల్లిలోని చర్చి దగ్గర పొలాలు బీటలు వారి దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. గణపవరం మండలంతోపాటు డెల్టాలోని అనేక మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల రైతులు ఇంజిన్లు వేసి నీటిని తోడుతూ పంటను కాపాడుకుంటున్నారు. వరిపైరు పొట్ట, ఈనిక దశకు చేరడంతో నీటిఎద్దడి సమస్య రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పరిస్థితి ఇలానే కొనసాగితే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి రానుందని బెంగపడుతున్నారు. రాత్రీ పగలు సాగునీటి కోసం కాలువల వెంబడి రైతులు పడిగాపులు పడుతున్నారు. నీటి తోడకానికి పెద్దఎత్తున ఖర్చవుతోంది. దీంతో పెట్టుబడి భారం రైతులకు పెరిగిపోతోంది. నీటి ఎద్దడికి ప్రధాన కారణం ఆక్వా చెరువులకు సాగునీరు మళ్లించడమేనని రైతులు చెబుతున్నారు. వచ్చే నీటిలో సగానికిపైగా ఆక్వా చెరువుల్లోకి మళ్లిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంపిఎల వద్ద, రాజకీయ నాయకుల వద్ద పలుకుబడి ఉన్నవాళ్లు తమ కాలువకు ఎక్కువ నీరు సరఫరా చేయించుకుంటున్నారు. వంతులవారీ విధానం సక్రమంగా అమలు కాకపోవడంతో రైతులకు ఏంచేయాలో తెలియని దుస్థితి నెలకొంది. సాగునీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



గణపవరం మండలంలో నీరందక ఇంజన్‌తో నీటితోడకం

ఆయిల్ ఇంజన్లే దిక్కు

బి.రాంబాబు, చిలకంపాడు, కొలుసైటు

సాగు చేసిన పంటలకు నీరందక నానా తంటాలు పడుతున్నాం. ఇంజన్లతో తోడుకుని పంటను కాపాడుకోవాల్సి వస్తోంది. దీంతో ఖర్చు భారీగా పెరిగిపోతోంది. ఈ తరుణంలో సాగునీరు అందకపోవడం వల్ల పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఏర్పడింది. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని సాగునీరు అందేలా చూడాలని కోరుతున్నాం.

నీరందక పొలం బీటలు వారింది

యుర్నిడి పురుషోత్తం, రైతు, బువ్వనపల్లి

బువ్వనపల్లి చర్చి సమీపంలో మూడెకరాలు సాగు చేస్తున్నా. సాగు నీరందక పొలం అంతా బీటలు వారింది. పంట దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. సాగునీరు సరిగ్గా అందకపోవడమే దీనికి కారణం. పొలం కాపాడుకునేందుకు ఇంజన్లతో నీటిని తోడేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. సాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలి


సైకిల్‌యాత్ర ప్రారంభంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం- నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

ప్రజలకు వాతలు పెట్టి కార్పొరేట్లకు దోచిపెట్టే, రాష్ట్రానికి, జిల్లాకు తీరని అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలో సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రను 38వ వార్డు లంకపేటలో బలరాం ప్రారంభించి మాట్లాడారు. బడ్జెట్ ప్రవేశపెడితే ధరలు తగ్గుతాయని ప్రజలు ఆశించారన్నారు. అయితే మోడీ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత ధరలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. విభజన ద్వారా నష్టపోయిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదని, వెనకబడిన ప్రాంతాలకు నిధుల్లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వేజోన్ హామీ పక్కన పెట్టారని, కడప ఉక్కు ఫ్యాక్టరీ నిధులు కూడా లేవన్నారు. మోడీ బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు రాయితీలిచ్చేలా, పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపేలా ఉందన్నారు. రైతాంగం పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించని ప్రభుత్వం వ్యవసాయ సబ్సిడీలు తగ్గించడం అన్యాయమన్నారు. జిల్లా నుండి ఆక్వా ద్వారా వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా బడ్జెట్లో జిల్లాకు ఎలాంటి నిధులూ కేటాయించలేదని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి జనసేన అధినాయకులు బడ్జెట్‌పై ఎలాంటి విమర్శలూ చేయలేదని ఆరోపించారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచే చర్యలు బడ్జెట్లో లేవన్నారు. పట్టణ ప్రాంతాల్లో పనుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధి హామీ పనులు చూపాలని డిమాండ్ ఉన్నా నిధులు పెంచకపోగా ఉన్న నిధులు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. నూటికి 64 శాతం ప్రజల నుంచి జిఎస్‌టి రూపంలో లక్షల కోట్లు వసూలు చేస్తున్న ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల నుంచి కేవలం మూడు శాతం మాత్రమే పన్ను వసూలు చేస్తుందని విమర్శించారు. క్రోని కేపిటలిజం పేరుతో అంబానీకి, అదానీకి దేశ సంపద దోచిపెడుతున్న విధానాన్ని సిపిఎం వ్యతిరేకిస్తుందని అన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల సేవ ఆపి ప్రజలకు సేవ చేయాలన్నారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడంలో భాగంగా ఈ నెల 24న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నామని, ఈ ధర్నాలో అన్ని తరగతుల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ యాత్రలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, నాయకులు ఎం.వైకుంఠరావు, కె.కృష్ణ, డి.నాగేశ్వరరావు, డి.త్రిమూర్తులు, వడుగు వెంకటేశ్వరరావు, సాయమ్మ, కుమారి, శ్రీను, జయమ్మ పాల్గొన్నారు.



భీమవరంలో మాట్లాడుతున్న బలరాం



ఉండిలో మాట్లాడుతున్న గోపాలన్

ఉండి: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 2023-24 బడ్జెట్ సామాన్య, మధ్యతరగతి ప్రజలకు, రైతాంగానికి ఏ మాత్రం ప్రయోజనకరంగా లేదని, కొత్త బడ్జెట్లో భారీగా కోతలు విధించారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. గురువారం సిపిఎం ప్రచార యాత్రలో భాగంగా ఉండి, కలిసిపూడి, చెరుకువాడ, అర్తమూరు, పాములపర్రు తదితర గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ అన్యాయాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు ఎరువుల సబ్సిడీలో భారీగా కోతలు విధించి రైతన్నలకు తీరని అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై ఈ బడ్జెట్లో ఊసే లేకుండా పోయిందన్నారు. విశాఖ ఉక్కును ప్రయివేటీకరించొద్దని రాష్ట్ర ప్రజలు మొరపెట్టుకుంటున్నా వెనక్కి తగ్గేదే లేదని కేంద్ర ప్రభుత్వం చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, నాయకులు చీర్ల శేషు, కొట్టాడ వెంకటేశ్వరరావు, రామకూరి వెంకటరత్నం, కడలి నాగేశ్వరరావు, కట్టా రవి, చీర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన ఎంఎల్‌సి నామినేషన్ల పర్వం

బరిలో 8 మంది అభ్యర్థులు-15 నామినేషన్లు దాఖలు

నేడు నామినేషన్ల పరిశీలన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల నామినేషన్ల పర్వం గురువారం ముగిసింది. ఈ నెల 16వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. చివరి రోజు గురువారం మరికొంత మంది నామినేషన్లు దాఖలు చేయగా అభ్యర్థులు ఎక్కువగా రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. చివరిరోజు గురువారం తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తంగా ఎనిమిది మంది అభ్యర్థులు 15 నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ సాగనుంది.

ఎనిమిది మంది అభ్యర్థులు..15 నామినేషన్లు

చివరి రోజు నామినేషన్ల దాఖలు సమయం ముగిసేటప్పటికి ఎనిమంది మంది అభ్యర్థులు 15 నామినేషన్లను దాఖలు చేశారు. ఆ వివరాలిలా ఉన్నాయి.

1.వంకా రవీంద్రనాథ్, వైసిపి, మూడు సెట్లు
2.కవురు శ్రీనివాస్, వైసిపి, మూడు సెట్లు
3.వంకా రాజకుమారి, వైసిపి, ఒక సెట్
4.వీరవల్లి చంద్రశేఖర్, టిడిపి, రెండు సెట్లు
5.నల్లి రాజేష్, స్వతంత్ర అభ్యర్థి, మూడు సెట్లు
6.పసల వెంకటాచలం, స్వతంత్ర అభ్యర్థి, ఒక సెట్
7.గోరింక దాసు, స్వతంత్ర అభ్యర్థి, ఒక సెట్
8.దేవరపల్లి ఆదాం, స్వతంత్ర అభ్యర్థి, ఒక సెట్

అత్యాచారయత్న నిందితులను కఠినంగా శిక్షించాలి

ఐద్వా ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆకివీడులో ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఇటుకులకుంట గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ రోజురోజుకీ బాలికలు, యువతులు, మహిళ లపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు మందులు, గంజాయి ప్రభావం వల్ల విచక్షణా జ్ఞానం కోల్పోయి పసిబిడ్డల మీద కూడా అత్యాచారాలు చేయడానికి వెనుకాడటం లేదని, ఇలాంటి దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చట్టాలు కఠినంగా అమలు చేయకపోవడం వల్లే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి వారిని శిక్షించాలని లేకపోతే రేపటి తరం మాయమైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి బంకుర యశోద, మండల కార్యదర్శి పి.సత్యవతి, మహాలక్ష్మి, వెంకట



నినదిస్తున్న మహిళలు

ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధం

పరిశీలకులు ఎస్.సురేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో స్థానిక సంస్థల నియోజకవర్గాల ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని ఎన్నికల పరిశీలకులు, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన జిల్లాలో పర్యటించి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక కలెక్టరేట్‌కు చేరుకున్న సురేష్ కుమార్‌కు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబుతో కలిసి కలెక్టర్ వెంకటేష్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను సురేష్ కుమార్‌కు వివరించారు. 1105 మంది ఓటర్లు తమ ఈ ఎన్నికల్లో వినియోగించుకునేందుకు ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 48 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు సురేష్‌కుమార్ మాట్లాడుతూ పశ్చిమగోదావరిలో ప్రశాంతంగా ఎన్నికలు జరగడం ఆనవాయితీగా ఉందన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పనులు సజావుగా సాగుతున్నాయన్నారు. పోలింగ్, కౌంటింగ్‌కు సంబంధించి సిబ్బందికి విధులు కేటాయించామని, వారికి అవసరమైన శిక్షణ అందిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు నియోజకవర్గాలకు సంబంధించి రెండు కన్నా ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే మార్చి 13న ఎన్నికలు నిర్వహించి, 16న కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు.

మార్చి నెలాఖరుకు రీసర్వే పూర్తికి చర్యలు

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం డివిజన్లో చేపట్టిన భూరీసర్వే పనులను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి ఎపి భూపరిపాలన చీఫ్ కమిషనర్ జి.సాయిప్రసాద్ భూ రీసర్వే పనులపై కలెక్టర్లతో సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రశాంతి పాల్గొని మాట్లాడారు. భీమవరం డివిజన్లోని 128 గ్రామాల్లో భూరీసర్వే పనులు చేపట్టాల్సి ఉండగా 47 గ్రామాల్లో సర్వే పూర్తయిందని చెప్పారు. మిగిలిన 81 గ్రామాల్లో సర్వే మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. గ్రౌండ్‌కంట్రోల్ పాయింట్స్ 94 గ్రామాల్లో పూర్తయ్యాయని, ఇంకా 34 చేయాల్సి ఉందని అన్నారు. సర్వే హద్దు రాళ్లు పది వేలు వచ్చాయని, రానున్న 15 రోజుల్లో రాళ్ల పాతే పనిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, జిల్లా సర్వే అధికారి కె.జాషువా పాల్గొన్నారు.

ఉండి: భూ రీసర్వే పనులను అత్యంత పకడ్బందీగా, వేగవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని ఉప్పులూరులో నిర్వహిస్తున్న భూసర్వే డ్రోన్ ఫ్లయ్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి, ఇన్‌ఛార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్థానిక రైతులతో మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన 75 సంవత్సరాల తర్వాత ప్రభుత్వం భూ రీసర్వే పనులను చేపట్టిందన్నారు. ఇది భూయజమానులకు గొప్ప వరమని, ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహశీల్దార్లు, విఆర్‌ఒలు రీసర్వే ఉపయోగాలపై రైతులందరికి అవగాహన కల్పించాలని సూచించారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా, సక్రమంగా డ్రోన్ ఫ్లయ్ అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని డిఎస్‌ఎల్‌ఒకు సూచించారు. వారంలోపుగా ఒఆర్‌ఐ మ్యాప్‌లు రానున్నాయని, అన్ని మండలాల సర్వే, రెవెన్యూ సిబ్బంది ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇన్‌ఛార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ రైతులతో మాట్లాడుతూ భూ రీసర్వే వల్ల ప్రయోజనాలను వివరించారు. రైతులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ, డ్రెయినేజ్ ఎఇలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహశీల్దార్ ఎం.రవీంద్రకుమార్, ఎంపిడిఒ ఎవి.అప్పారావు, గ్రామ సర్పంచి యర్రా దుర్గారావు, ఎంపిటిసి సభ్యులు నిమ్మల కేశవకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

నేడు, రేపు సామూహిక ఎలుకల నిర్మూలన

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 24, 25 తేదీల్లో మండలంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి మద్దాల జయదుర్గమాధురి తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో విఎఎలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విధినిర్వహణలో అలసత్వం వద్దన్నారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 61 కిలోల బ్రోమోడైలిన్ మందును ప్రతి రైతు భరోసా కేంద్రంలో పంపిణీ చేస్తారన్నారు. ఈ నెల 27న పిఎం కిసాన్ లబ్ధిదారులకు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తారని తెలిపారు. ఇ-క్రాప్, ఇకెవైసి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ సత్యనారాయణ, దుర్గభవాని, విఎఎలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయదుర్గామాధురి

లలిత కళలతోనే సామాజిక చైతన్యం

ప్రిన్సిపల్ అంజనీకుమార్

ప్రజాశక్తి భీమవరం రూరల్

ప్రపంచ ఇంద్రజాల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డిఎన్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మ్యాజిక్ స్టార్ బోస్‌ను ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంజనీకుమార్ మాట్లాడుతూ లలిత కళలతోనే సామాజిక చైతన్యం సాధ్యమని, కళలు మానసికోల్లాసానికి దోహదపడతాయని అన్నారు. కోపల్లెలో జన్మించి మన కళాశాల విద్యార్థిగా దేశ విదేశాల్లో అనేక అవార్డులు పొందిన మ్యాజిక్ స్టార్ బోస్ ఇంద్రజాల రంగానికే గర్వకారణమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మ్యాజిక్ స్టార్ బోస్ డిఎన్‌ఆర్ కళాశాల వ్యవస్థాపకులు దంతులూరి నారాయణరాజు కుటుంబీకులన్నారు. ఇటీవల గోవాలో గ్లోబల్ స్కాలర్స్ ఫౌండేషన్ భారత కళారత్న అవార్డుతో సత్కరించిందని, ఈ సందర్భంగా బోస్‌ను ఘనంగా సత్కరించామని తెలిపారు. కళాశాల గ్రంథాలయ అధికారి కె.శిరీష, రంగస్థల నటులు చుక్కన శ్రీ, రిటైర్డ్ పిఇటి గొట్టుముక్కల బంగర్రాజు, బోస్ కుటుంబ సభ్యులు గాదిరాజు రామరాజు, ఇందుకూరి రామకృష్ణంరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి కోతులు..ఆందోళనలో ప్రజలు

కోతి దాడిలో 8 మందికి గాయాలు

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు పట్టణం, పరిసర గ్రామాల్లో కోతులు హల్‌చల్ చేస్తుండటంతో జనం బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. వీధి కుక్కల సంఖ్య పెరగడంతోపాటు కోతులు జనావాసాల్లో సంచరిస్తుండటం, ప్రజలు, ప్రయాణికులపై దాడులు చేస్తుండటం అందరినీ ఆందోళనకు గురి చేస్తోంది. పట్టణంలో గోస్తనీ కాలువ పెద్ద వంతెన, చిన్న వంతెనలు, కొమ్మాయిచెరువు గట్టు, రైల్వే, బస్టాండ్‌లతోపాటు పరిసర గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. ఈ కోతులను తప్పించుకుని వెళ్లేందుకు పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



ఇళ్లపై కోతుల గుంపు


ఎనిమిది మందిని కరిచిన కోతి

బుధ, గురువారాల్లో మండలంలోని మండపాక గ్రామంలో ఇంటి వద్ద ఉన్న చిన్నారుల నుంచి 60 ఏళ్ల వయస్సు గల వృద్ధుల వరకూ సుమారు ఎనిమిది మందిపై కోతి దాడి చేసి కరిచింది. వీరంతా తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికెళ్లారు.

కోతులను ఊరికి దూరంగా తరలించాలి

నాగలక్ష్మి, బాధితురాలు

ఇంటి వద్ద ఉన్న నాపైకి ఒక్కసారిగా కోతి ఉరికింది. భయంతో కింద పడగానే నా తొడ భాగంలో కోతి కరిచింది. గ్రామంలో అనేక మందిపై కోతి దాడి చేసింది. అయినా అధికారులు ఎవరూ ఇప్పటి వరకు పట్టించుకున్న దాఖలాల్లేవు. ఎవరికీ ఇటువంటి పరిస్థితి లేకుండా కోతులను ఊరికి దూరంగా తరలించేలా చర్యలు చేపట్టాలి.





కోతి దాడిలో మహిళకు, బాలునికి గాయాలు

ఆప్యాయతకు మారుపేరు సర్రాజు

మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - కాళ్ల


ఉండి మాజీ ఎంఎల్‌ఎ పాతపాటి సర్రాజు ఆప్యాయతకు మారుపేరని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. భీమవరంలో సర్రాజు కుటుంబ సభ్యులను ఆయన గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ సర్రాజు మృతికి రెండు రోజుల ముందు తాడేపల్లిగూడెం తమ ఇంటికొచ్చారన్నారు. జక్కరం శివాలయాన్ని రూ.కోటితో అభివృద్ధి చేయాలని, సిజిఎఫ్ నిధులు మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేయాలని సర్రాజు కోరారన్నారు. సర్రాజుతో తనకున్న అనుబంధాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. అనంతరం సర్రాజు కుమారులు పాతపాటి వాసు, నాగ వర్మకు ధైర్యం చెప్పి వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సర్రాజు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, ఆయన సోదరుడు పెదనరసింహరాజు, మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు తదితరులు ఉన్నారు.

సర్రాజు అందరికీ మార్గదర్శకులు: ఎంఎల్‌ఎ గ్రంధి

అందరికీ మార్గదర్శకంగా నిలిచిన వ్యక్తి కీర్తిశేషులు పాతపాటి సర్రాజు అని భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం ఆదర్శనగర్‌లో సర్రాజు నివాసం వద్ద గురువారం ఆయన సర్రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ 2004లో సర్రాజుతోపాటు భీమవరం నుంచి తాను ఎంఎల్‌ఎగా గెలుపొందానన్నారు. నాడు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉండి నియోజకవర్గంలో రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత సర్రాజుదేనన్నారు. కార్యక్రమంలో తోట భోగయ్య, తిరుమాని ఏడుకొండలు పాల్గొన్నారు.



సర్రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొట్టు, శివ



నివాళులర్పిస్తున్న ఎంఎల్‌ఎ గ్రంధి

నూతన ఆలోచనలు విజయానికి దిక్సూచి


ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ప్రమోద్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉల్కన్ జి ఉత్సవాల్లో భాగంగా ఎపి నిట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన తిరుపతి జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ఇస్రో)కి చెందిన మొబైల్ వాహనాన్ని (స్పేస్ ఆన్ వీల్స్ ప్రోగ్రాం) ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రమోద్ పడోలే మాట్లాడుతూ కొత్త ఆలోచనలు విజయానికి దిక్సూచి వంటివని తెలిపారు. యువత నవ్యాలోచనలు, సాంకేతిక నైపుణ్యాలను రక్షణ రంగంలో వినియోగించి దేశ శక్తి, సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ చదువు, మార్కులే ప్రాతిపదికగా కాకుండా విభిన్న ప్రాజెక్టులు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తున్నామని, ఇందుకు వారినుంచి అనూహ్య స్పందన వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జివి.వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ తలారి రేష్మా, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ టి.రమేష్, డాక్టర్ హైమావతి, డాక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

గణపతిరావు మృతి బాధాకరం

ప్రజాశక్తి - తణుకు రూరల్


గణపతిరావు (ఫైల్‌ఫోటో)

మండలంలోని తేతలి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షులు కర్రి గణపతిరావు మృతి బాధాకరమని రాష్ట్ర పౌర సరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. కర్రి గణపతిరావు (48) గురువారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందారు. యధావిధిగా తెల్లవారుజామున వాకింగ్ నిమిత్తం బయటకు వెళ్లి ఇంటికి వచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో కుటుంబ సభ్యులు వైద్యులకు చికిత్స నిమిత్తం చూపించారు. అప్పటికే గణపతిరావు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన మృతితో గ్రామ ప్రజలు, బంధుమిత్రులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. గణపతిరావు దసరా పండుగను పురస్కరించుకుని ఆయన స్వగృహంలోని దుర్గాభవాని పీఠం ద్వారా వందలాది మంది భవానీ భక్తులకు సొంత ఖర్చుతో అల్పాహారం నుంచి రాత్రి భోజనం వరకు అన్నదానం నిర్వహించేవాడు. ఆయన మృతి పట్ల మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, వైసిపి సిజిసి సభ్యులు చీర్ల రాధయ్య, తేతలి సర్పంచి సరెళ్ల క్రాంతి ప్రియ, ఉప సర్పంచి కోట నాగేశ్వరరావు, వైసిపి నాయకులు కోట స్వామీజీ, సరెళ్ల కృపావరం, సరెళ్ల సతీష్, శ్రీనివాసరాజు, కృష్ణ పాల్గొన్నారు.

అనర్హులు లబ్ధి పొందుతున్నారని ఫిర్యాదు

ప్రజాశక్తి - పెనుమంట్ర

జగనన్న గృహ నిర్మాణ విషయంలో పట్టాలు అసలైన లబ్ధిదారులకు ఇవ్వకుండా సర్పంచి బంధువులు లబ్ధి పొందుతున్నారని నెగ్గిపూడి శివారు వనంపల్లికి చెందిన కట్ట ప్రమీల కుమారి, విజ్జమూరు సత్యవతి తహశీల్దార్ దండు అశోక్ వర్మకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సర్పంచి మామిశెట్టి ధనలక్ష్మి కుమార్తె జక్కంపూడి వెంకటలక్ష్మి గ్రామ వాలంటీర్‌గా చేస్తుందన్నారు. ఆమె భర్తకు నరసాపురంలో స్థలాలు ఉన్నాయని వారు ఆరోపించారు. జగనన్న కాలనీలో పట్టా పొందకపోయినా పట్టా ఉందని గురువారం ఉదయం శంకుస్థాపన చేసేందుకు ప్రయత్నించగా విఆర్‌ఒ రామలక్ష్మి తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి అడ్డుకున్నారన్నారు. దీంతో శంకుస్థాపన నిలిపివేశారన్నారు. తమను ఇళ్లు నిర్మించుకోమని స్థానిక ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు చెప్పారని సర్పంచి అంటున్నారని ప్రమీలకుమారి, సత్యవతి తహశీల్దార్‌కు వివరించారు. ఈ విషయంపై తహశీల్దార్ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎంఎల్‌సి పదవుల కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపి ప్రభుత్వంలో బిసిలకు అగ్ర తాంబూలం అందుతుందని, 18 మంది ఎంఎల్‌సిల్లో 11 పదవులను బిసిలకు ఇవ్వడం హర్షణీయమని డిసిఎంఎస్ ఛైర్మన్, బిసి సంఘాల నేత వేండ్ర వెంకటస్వామి అన్నారు. స్థానిక ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో గురువారం బిసి సంఘాల అగ్ర నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే బిసిలకు పెద్ద పీట వేసిన ఘనత కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డికి దక్కిందని, నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కిందని అన్నారు. బిసిలు వెనుకబడిన వారు కాదని, వారికి జగన్ ప్రభుత్వం అండగా ఉందని మరోకసారి నిరూపించారన్నారు. జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, జాతీయ బిసి సంక్షేమ సంఘ ం జిల్లా అధ్యక్షులు కొడే యుగంధర్, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు, రాష్ట్ర తూర్పు కాపు సంఘ నాయ కులు ముల్లి నరసింహమూర్తి, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు గొలగాని సత్యనారా యణ మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో బిసి వర్గాలన్నింటికీ కూడా నామినేటెడ్ పదవులు ఇచ్చిన ఘనత ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌కు దక్కిందన్నారు.

నేడు గేదె, లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని చింతపర్రు గ్రామ సచివాలయం వద్ద ఈ నెల 24వ తేదీ శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి గేదె, లేగ దూడల ప్రదర్శన, అందాల పోటీలు నిర్వహిస్తున్నామని పశువైద్యాధికారి డాక్టర్ పి.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయని తెలిపారు. ఈ పోటీలో పాల్గొనే ప్రతి లేగ దూడకు కన్సోలేషన్ బహుమతి, ఉచిత మెడికల్ కిట్ అందిస్తామన్నారు. మండలంలోని రైతు సోదరులందరూ వారి వద్ద ఉన్న సంవత్సరంలోపు గేదె, లేగ దూడలను తీసుకొని వచ్చి ప్రదర్శనలో పాల్గొనాలని కోరారు.

వైసిపి గ్రీవెన్స్ సెల్ జిల్లా ఛైర్మన్‌గా రామచంద్రరావు

ప్రజాశక్తి - ఉండి

వైసిపి గ్రీవెన్స్ సెల్ జిల్లా ఛైర్మన్‌గా ఆ పార్టీ సీనియర్ నాయకులు కరిమెరక రామచంద్రరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం పలువురు వైసిపి నాయకులు రామచంద్రరావుకు శాలువ కప్పి అభినందించి మాట్లాడారు. రామచంద్రరావు వైసిపి ఆవిర్భావం నుంచి అంకితభావంతో పని చేశారన్నారు. ఆయన మరిన్ని పదవులు పొందాలని, తద్వారా బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆయన సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు, ఉండి ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, వైసిపి జిల్లా కార్యదర్శి మునుకోలు సింహాచలం, పార్టీ సీనియర్ నాయకులు కరిమెరక శివనాగరాజు, రణస్థుల మహంకాళి, మల్లువలస సత్యనారాయణ, కరిమెరక మల్లికార్జున్, కమతం బెనర్జీ, ఇల్లాపు వెంకట అప్పాజీ, బడుగు బాలాజీ పాల్గొన్నారు.

మేకా శేషుబాబును కలిసిన విన్‌స్టన్‌బాబు

ప్రజాశక్తి - పాలకొల్లు

జిల్లా యువజన విభాగ అధ్యక్షులుగా ఎంపికైన కుంచనపల్లి విన్ స్టన్ బాబు మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుంనపల్లి విన్‌స్టబన్‌బాబును మేకా శేషుబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మైఖేల్ రాజు, కో ఆప్షన్ సభ్యులు తండా ఇస్సాకురాజు, కర్ని జోగయ్య, పోనుకుమట్ల వీరాస్వామి, పార్సీ వెంకటరత్నం, సాకా కమలాకర్, అన్నవరపు వెంకటరమణ, కోట రత్నరాజు పాల్గొన్నారు.

రూ.1.10 లక్షల విలువైన గంజాయి పట్టివేత

ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - తణుకు

గంజాయి కలిగి ఉన్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి రవిప్రకాష్ వెల్లడించారు. పట్టణంలోని జపాన్ కాలనీ శివారు గంజాయి కలిగి ఉన్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పట్టణంలోని ఇరగవరం రోడ్డు కాలనీకి చెందిన కరుపోతు తరుణ్‌కుమార్‌ను, సజ్జాపురానికి చెందిన పంపి రెడ్డి శ్యామ్‌కుమార్‌ను, ఒక బాలుడిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1.10 లక్షల విలువైన 22.125 కేజీల గంజాయిని, ఒక మోటార్ సైకిల్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి జ్యూడిషియల్ కస్టడీ నిమిత్తం పంపించారు. వీరు విశాఖపట్నం జిల్లా అరకు నుంచి తీసుకొచ్చి గంజాయిని ఈ ప్రాంతంలో అమ్ముతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ సిహెచ్.ఆంజనేయులు ఎస్ఐ కె.గురవయ్య, ఎఎస్ఐ బి.పోలయ్య పాల్గొన్నారు.

సొమ్ము కొట్టు.. పత్రాలు పట్టు..!

అనధికార లే అవుట్లకు రిజిస్ట్రేషన్లు

ప్రభుత్వ ఆదాయానికి గండి

దృష్టి సారించని ఉన్నతాధికారులు


గునుపూడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సొమ్ములు ఇస్తే చాలు... అది ఏ భూమైనా రిజిస్ట్రేషన్ చేస్తారు.... అనధికార ప్రయివేట్ భూములే కాదు... ప్రభుత్వ భూములు సైతం ఇందుకు మినహాయింపు కాదు.. కేవలం వారికి కావాల్సింది అడిగినంత సొమ్ము ఇవ్వడం.. ఈ విషయంలో వారు తృప్తి పడితే మాత్రం రోజుల్లోనే అన్ని పనులు ముగించేసి పత్రాలు అప్పగించేస్తారు.. జిల్లా కేంద్రమైన భీమవరంలోని గునుపూడి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం కేంద్రంగా సాగుతున్న ఈ వ్యవహారం నేడు చర్చింశనీయాంశంగా మారింది. ఇప్పటికే భారీ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ తన పంథాను మార్చుకోవడం లేదు. ఎవరికి వారే యమునా తీరే అన్నచందంగా ఆయా ప్రాంతాల్లో అధికారులు వ్యవహరిస్తున్నారు.


అనధికార లే అవుట్

నిషేధం ఉన్నా..!

అనధికార లే అవుట్లను ఎట్టి పరిస్థితుల్లో రిజిస్ట్రేషన్ చేయరాదని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. దొడ్డిదారిలో ఎటువంటి అనుమతులు లేని లే అవుట్లలో ఫ్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో పెద్దసంఖ్యలో ఇళ్ల స్థలాల వెంచర్లు ఉన్నాయి. వీటిలో అధికంగా అనుమతులు పొందనవే ఉండటంతో వీరికి వరంగా మారింది. ఇటు నిషేధం.. అటు అనధికార ల అవుట్ కావడంతో కార్యాలయ అధికారులకు కాసుల పంటగా మారింది. లేఖర్ల ఆధ్వర్యంలో సాగుతున్న ఈ తంతులో నిత్యం రూ.లక్షలు చేతులు మారుతున్నట్లు సమాచారం.

సెంటుకు రూ.5 వేల వరకు...!

నాన్ లే అవుట్‌లో స్థలం రిజిస్ట్రేషన్ చేయాలంటే సెంటుకు రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేల వరకు ఖర్చు అవుతుంది. అదీ అక్కడ ఉన్న పరిస్థితుల బట్టి ధర మారుతుంది. లే అవుట్ ముందు వరసులోది అయితే ఒక రకం, వెనుక భాగంలో అయితే మరో ధర ఉంటుంది. ఇక ప్రాంతం బట్టి సైతం ధర నిర్ణయిస్తున్నారు. ఇదంతా లేఖర్ల కనుసన్నల్లో కార్యాలయ అధికారి ఆదేశాల మేరకు జరిగిపోతుంది. సంబంధిత సొమ్ము చేతికందగానే ఈ రిజిస్ట్రేషన్ పనులన్నీ చకచక సాగిపోతున్నాయి. దీంతో నాన్ అవుట్ రూపంలో ప్రభుత్వానికి చేరాల్సిన సొమ్ముకు గండి పడుతుంది. ఇక ప్రభుత్వ, ఇతర రకాల భూములకు సైతం రక్షణ లేకుండాపోయింది. బహిరంగంగానే సాగుతున్న ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు మాత్రం దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా స్పందించి ఈ రెండు నెలల కాలంలో జరిగిన కార్యకాలపాలపై విచారణ చేస్తే ఎన్నో అంశాలు బయటకొస్తాయని పలువురు చెబుతున్నారు.

రోడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్ పరిధిలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆర్అండ్‌బి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో ఆయా శాఖల పరిధిలో చేపట్టిన పనులపై సమీక్షించి మాట్లాడారు. జిల్లాలో 35 రహదారుల నిర్మాణ పనులను అత్యవసర కేటగిరీ కింద గుర్తించినట్లు చెప్పారు. వీటితో పాటు అదనంగా అవసరమైన వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పెదఅమిరం నుంచి ఉండి వరకు ఆరు కిలోమీటర్ల నిడివి గల పుంత రోడ్డు అవకాశం మేరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి లేక రోడ్డు వెడల్పు చేయడానికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. సెంట్రల్ రోడ్డు ఫండింగ్ నిధులతో చేపట్టిన భీమవరం - పిప్పర, కాళీపట్నం - జగన్నాధపురం, తదితర రోడ్లను గడువులోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్ల మరమ్మతుల పనులు 70 శాతం పూర్తయ్యాయని జిల్లా ఆర్అండ్‌బి అధికారి కలెక్టర్‌కు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఆర్అండ్‌బి అధికారి ఎస్.లోకేశ్వర్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి కెఎస్ఎస్.శ్రీనివాసరావు, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖల డిఇలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం డిపో పరిధిలో ఉన్న ఐదు మండలాల్లో ఉన్న ప్రయాణికులకు ఈ నెల 24వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థవారు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సూచనలు, సలహాలు 9959225485కు ఫోన్ చేసి తెలియజేయలని పేర్కొన్నారు.

ముత్యాలపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - మొగల్తూరు

ఆక్యుపంక్చర్ వైద్యంతో రోగాలను నయం చేయవచ్చునని ఆక్యుపంక్చరిస్ట్, కొవ్వలి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి కొండా శ్రీధర్ అన్నారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత ఆక్యుపంక్చర్ మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఆక్యుపంక్చర్ రెండు విభాగాలుగా ఉంటుందన్నారు. వైద్యులు అన్నపూర్ణ, అలేఖ్య, అనిత, హరిణి, మమత, నిర్మల, రామారావు, భవాని కుమార్, సుబ్రహ్మణ్యం, హారిక, జ్యోతిర్మయి, లక్ష్మి, కార్తీక, శ్రీనివాస్, పవన్, కోమల, శాలిని ఈ శిబిరంలో వైద్య సేవలు అందించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - పెనుగొండ

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తణుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సత్యవతి అన్నారు. మండలంలోని సిద్ధాంతం ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు వాడకం వల్ల వచ్చే అనర్థాలపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ఈ సదస్సులో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.శ్రీరామ చంద్రమూర్తి, సచివాలయ మహిళా పోలీసులు శ్రీతనయ, కరుణ, సంధ్య జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరుకొల్లులో భూ కమతాల చిత్రీకరణ

ప్రజాశక్తి - పాలకోడేరు

భూ రీ సర్వేలో భాగంగా మండలంలోని కోరుకొల్లు గ్రామంలో గురువారం డ్రోన్‌తో భూ కమతాల చిత్రీకరణ పనులు ప్రారంభించారు. ఈ పనులు మరో నాలుగు రోజులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ హుస్సేన్, రీ సర్వే ఉప తహశీల్దార్ సూర్యనారాయణరాజు, మండల సర్వేయర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ పాల్గొన్నారు.

కార్మికులకు విస్తృత సేవలు అందించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కార్మికులకు విస్తృత సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని పార్టీ పరంగా నూతనంగా నియమితులైన ట్రేడ్ యూనియన్ కమిటీ జిల్లా అధ్యక్షులు మారోజు గణేష్‌కు ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ సూచించారు. ట్రేడ్ యూనియన్ కమిటీ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన గణేష్ ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌ను గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసిపిని మరింత బలోపేతం చేసేందుకు పార్టీపరంగా అనుబంధ కమిటీలను నియమించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో సుపరిపాలన జరుగుతుందని, గత మూడున్నరేళ్లుగా చూస్తే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతానికి పైగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కిందన్నారు. ప్రతి కార్మికుడిని ఆదుకోవడానికి అనేక సంక్షేమ పథకాలను కూడా అమలు చేస్తున్నారన్నారు. కార్మికుల జీవితాలకు భద్రత కల్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భవిష్యత్తులో కూడా వారికి మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసే విధంగా రూట్ మ్యాప్ తయారు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు, యాదవ్ సంఘం జిల్లా అధ్యక్షులు గొలగాని సత్యనారాయణ, సోమేశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్ చెల్లబోయిన సూర్యప్రకాష్, రాష్ట్ర తూర్పు కాపు సంఘం నాయకులు నరసింహమూర్తి పాల్గొన్నారు.

రామచంద్రరావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఆచంట


రామచంద్రరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచి

బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు శ్రమించి తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన సిపిఎం సానుభూతిపరులు కట్టా రామచంద్రరావు (80) మృతి తీరని లోటని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ కొనియాడారు. కొడమంచిలి గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ సానుభూతిపరులు కట్టా రామచంద్రరావు (80) ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు చిత్రపటానికి సర్పంచి సీతారామ్ పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం సిపిఎం పార్టీలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. గతంలో పంచాయతీ వార్డు మెంబర్‌గా పని చేసి అందరి మన్ననలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు మన్నె సుబ్బారావు, వార్డు మెంబర్లు బొక్కా మల్లేశ్వరరావు, పుచ్చకాయల నాగార్జున, వైసిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు కొండేటి రమేష్, వైసిపి నాయకులు పోలిశెట్టి వనమరాజు, రొక్కల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

26న కొమ్ముగూడెంలో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని కొమ్ముగూడెంలోని సొసైటీ ఆవరణలో ఈ నెల 26వ తేదీన ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కొమ్ముగూడెం సొసైటీ ఛైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లిగూడెం యూనియన్ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో గుండె, ఎముకలు, నరాలు, చిన్నపిల్లలు, సాధారణ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ఛైర్మన్ నరేంద్రకుమార్ కోరారు.

విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలి


ప్రజాశక్తి - తణుకు

విద్యార్థులు అనవసరమైన ఆలోచనలకు దూరంగా ఉండి మంచి క్రమశిక్షణతో చదువుకోవాలని మానవత సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కోడూరి రాధా పుష్పవతి అన్నారు. స్థానిక ఎస్ఎన్‌విటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షులు ఆలపాటి సుబ్బారావు, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగవేణి సమస్త సభ్యులు ఆలపాటి సోమేశ్వరరావు, పి.వీరభద్రం, హరి, భవాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాకు ఇల్లు నిర్మించి ఉద్యోగం ఇప్పించండి

ఎంఎల్‌ఎ శ్రీరంగనాధరాజును కోరిన మహిళ

ప్రజాశక్తి - ఆచంట


ఎంఎల్‌ఎ శ్రీరంగనాధరాజుకు సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

"నా భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. నా పిల్లలను పెంచడానికి నా దగ్గర ఆస్తులు, అంతస్తులు లేవు. అద్దె ఇంట్లో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాను. కనీసం నాకు ఇల్లు కట్టించి, ఆశా కార్యకర్త ఉద్యోగమైనా ఇప్పించండి" అంటూ ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీ రంగనాధరాజును ఆచంట పంచాయతీ పరిధి వంకతాళ్ల చెరువుకు చెందిన కుడిపూడి అనంతలక్ష్మి వేడుకోంది. మండలంలోని వంకతాళ్ల చెరువులో గురువారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ శ్రీరంగనాధరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి తన ఆవేదనను ఎంఎల్‌ఎకు వివరించారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ అనంతలక్ష్మికి ప్రభుత్వ పరంగా ఇంటి స్థలం ఇచ్చి ఆ ఇంటిని తన సొంత డబ్బులతో ఇల్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు. ఆమెకు ఆశా కార్యకర్త ఉద్యోగం కూడా ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆ గ్రామస్తులు రహదారి అధ్వానంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లారు. రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని ఎంఎల్‌ఎ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షులు పెచ్చెట్టి సత్యనారాయణ, కిరణ్, రాజు శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయవాడ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్. నెం. 1365/2021

బిట్వీన్:
M/s.యామ్.యస్.రెడ్డి స్టీల్ కార్పొరేషన్
రిప్. బై ప్రో॥ దేవి మోర్తా -వాది
మరియు
M/s.ఆపెక్స్ అగ్రో ఎక్యూప్మెంట్స్
మరియు ఇతరులు 3 -ప్రతివాది

1వ ప్రతివాది ఆపెక్స్ అగ్రో ఎక్యూప్మెంట్స్, రిప్ బై మేనేజింగ్ పార్ట్నర్, ప్లాట్ నెంబరు 18 నుండి 22, ఏ.పి.ఐ.ఐ.సి. ఇండస్ట్రియల్ పార్క్, నూజివీడు, కృష్ణా జిల్లా.

పై నెంబరు గల దావాను ప్రతివాదులు 1 నుండి 4ల పై ఖాతా బాకీ తాలుకు అమౌంట్ బాలన్స్ మొత్తము వడ్డీతో సహ రూ.8,01,193/-లను ఖర్చులతో రాబట్టుకొనుటకు దాఖలు చేయగా అందుపై దావాలో 1వ ప్రతివాదికి సమన్లు నిమిత్తము ది.01-03-2023నకు వాయిదాగా వేసినారు. ఆరోజు ఉదయం 10.30ని॥లకు 1వ ప్రతివాది స్వయముగా కాని అడ్వకేట్ ద్వారాగాని పైకోర్టులో హాజరై ఆక్షేపణలను తెలుపుకోవలెను లేని యెడల దావా కోర్టు వారిచే పరోక్షముగా తీర్మానించబడును.
చిత్తగించవలెను.
వాయిదా: 01-03-2023

ఆలూరి సుధాకరరావు
రాజబోయిన శ్రీహరిప్రసాద్
విజయవాడ
వాదితరపు నాయ్యవాది

మహారాజశ్రీ 4వ అదనపు జూనియర సివిల్ జడ్జి మరియు ప్రొహిబిషన్ & ఎక్సైజ్ మేజిస్ట్రేట్ ఏలూరు వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 283/2021

బిట్వీన్:
వానరాసి నాగమణి ...పిటీషనరు
మరియు
ఎస్.మునిశంకర్, తండ్రి: కనకరాజు, వ్యాపారం, బొమ్మసంద్ర, ఇండస్ట్రియల్ ఏరియా, జిగాని లింక్‌రోడ్డు, బెంగళూరు-560099
...రెస్పాండెంటు

టు: ఎస్.మునిశంకర్, తండ్రి: కనకరాజు, వ్యాపారం, బొమ్మసంద్ర, ఇండస్ట్రియల్ ఏరియా, జిగాని లింక్‌రోడ్డు, బెంగళూరు-560099

పత్రికా ప్రకటన

పై నెంబరు దావా గ్రంధములో రెస్పాండెంటుకు మహారాజశ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం మీకు కోర్టు వారి నుండి ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపించినను, అవి ప్రతివాది తీసుకొనక త్రిప్పి పంపుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు ప్రతివాదికి దావా సమన్లు పత్రికా ప్రకటన మూలంగా తెలియజేయుటకు ఆర్డరు చేసి యున్నారు. పై దావా గ్రంధము **ది.09-03-2023వ తేదీకి వాయిదా అయి ఉన్నది.** కావున ఆరోజున మీరు స్వయంగా గాని లేదా మీ తరపున న్యాయవాది ద్వారా గాని ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు కావలయును. లేని ఎడల కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానము చేయుదురు.

వాయిదా తేదీ: 09-03-2023

శ్రీమతి ఆర్.రాజరాజేశ్వరి
అడ్వకేట్, అగ్రహారం, ఏలూరు.
సెల్: 94410 40029

గ్రామపంచాయతీ కార్యాలయం - పాలమూరు
పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా

 రి.క.నెం. 06/2023 తేది.24-02-2023

టెండరు నోటీసు

పశ్చిమ గోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, పొలమూరు గ్రామ పంచాయితి నందు 2023-2024 సం॥మునకు అనగా (ది.1-4-2023 నుండి 31-03-2024 వరకు) ఈ దిగువ నుదహరించిన పనులు కాంట్రాక్టు పద్ధతి పై నిర్వహించుటకు మరియు పంచాయితీకి కావలసిన సామాగ్రి సరఫరా చేయుటకు సీలు వేయబడిన టెండర్లు ది.28-02-2023 సం॥రం తేదీన గ్రామ పంచాయితీ కార్యాలయం నందు సాయంత్రం 4:00 గంటల వరకు పంచాయితీ కార్యదర్శి వారిచే స్వీకరించబడి అదే రోజు సాయంత్రం గం॥ 4:30 ని॥లకు అప్పటికి హాజరైన టెండరు దారుల సమక్షమున టెండర్లు తెరువబడును. టెండరు దాఖలు చేయువారు షెడ్యూలు పొంది, టెండర్ ధరావతు చెల్లించి దాఖలు చేయవలయును. మిగిలిన విషయములు గ్రామ పంచాయితీ కార్యాలయము పనిచేయు వేళల యందు తెలుసుకొనవలెను.

షెడ్యూలు

వ.నెం.	పని వివరములు మరియు సరఫరా వివరం	కావలసిన వ్యక్తుల సంఖ్య	చేయవలసిన ధరావతు
1.	2023-2024 సం॥రంకు (1-4-2023 నుండి 31-3-2024) పారిశుధ్యపు పనులు నిర్వహించుటకు	9	50
2.	2023-2024 సం॥రంకు వాటర్ వర్క్స్ పనులు నిర్వహించుటకు (పంపు ఆపరేటర్)	2	50
3.	2023-2024 సం॥రంకు వీధి లైట్లు రిపేరు పనులు నిర్వహించుటకు (ఎలెక్ట్రిషియన్ కం స్విచ్ ఆపరేటర్)	1	50
4.	2023-2024 సం॥రంకు ఫిట్టరు పనులు నిర్వహించుటకు	1	50
5.	2023-2024 సం॥రంకు పారిశుధ్యం సామానులు సరఫరా చేయుటకు		100
6.	2023-2024 సం॥రంకు వాటర్ వర్క్స్ సామానులు మరియు చేతి పంపు సామాగ్రి సరఫరా చేయుటకు		100
7.	2023-2024 సం॥రంకు వీధి విద్యుత్ లైట్లు సామాగ్రి సరఫరా చేయుటకు		100
8.	2023-2024 సం॥రంకు స్టేషనరి సామాగ్రి సరఫరా చేయుటకు		100

గమనిక: 1. గ్రామ పంచాయితీ నిధుల నిల్వను బట్టి పేమెంట్ చెల్లించబడును.
2. టెండర్లు ఏ కారణం తెలుపకనే రద్దు చేయుటకు పంచాయితీ కార్యదర్శి వారికి పూర్తి అధికారము కలదు.

సం/- **యస్.మోహన్‌రావు,** ఇన్‌ఛార్జ్ పంచాయతి కార్యదర్శి, గ్రామపంచాయతి, పొలమూరు.